ట్రాఫిక్‌లో ట్రాన్స్‌జెండర్లు..!



ట్రాన్స్‌జెండర్లకు సూచనలు ఇస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా

- వెస్ట్‌జోన్ పరిధిలో ఎనిమిది మంది కేటాయింపు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలు
- ఇప్పటికే సేవలందిస్తున్న హైడ్రా సిబ్బంది
- ట్రాన్స్‌జెండర్లు, హైడ్రా సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది విధుల్లో

బంజారాహిల్స్: ట్రాఫిక్ విధుల్లో ట్రాన్స్‌జెండర్లు (ట్రాఫిక్ అసిస్టెంట్లు) గా విధులు నిర్వర్తిస్తున్నారు. రెండురోజుల క్రితం వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి ఎనిమిది మంది ట్రాఫిక్ అసిస్టెంట్లను కేటాయించారు. వీరు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రధాన చౌరస్తాల్లో ట్రాఫిక్ పోలీసులకు సహాయకులుగా పనిచేస్తుంటారు. ఒక్కో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరి చొప్పున కేటాయించారు. పంజగుట్ట, జూబ్లీహిల్స్, కేబీఆర్ పార్కు, మైత్రీవనం చౌరస్తాల్లో ప్రస్తుతం వీరు విధులు నిర్వహిస్తున్నారు. ట్రాన్స్‌జెండర్ల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడమే కాకుండా వారిని గుర్తించి ఇటీవలే శిక్షణ కూడా ఇచ్చారు. ట్రాఫిక్ విధి విధానాలు, వాహనదారులతో వ్యవహరించాల్సిన తీరు, ట్రాఫిక్ పోలీసులు అంటే ఏమిటి, సేవలు ఎలా వినియోగించుకోవాలి అన్న దానిపై శిక్షణ పూర్తయ్యింది. ఒక్కో పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరి చొప్పున ప్రధాన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు కేటాయించారు. కూడళ్లలో సిగ్నల్ జంపింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, స్టాప్‌లైన్ దాటి ముందుకురావడం తదితర ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై వీరు దృష్టిపెడతారు. రెండు రోజులుగా ఆయా చౌరస్తాల్లో వీరు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు.

ఇప్పటికే హైడ్రా సిబ్బంది సేవలు..

ట్రాఫిక్ విధుల్లో హైడ్రా సిబ్బంది సేవలు కూడా కొనసాగుతున్నాయి. ఒకవైపు ట్రాఫిక్ అసిస్టెంట్ల పేరుతో ట్రాన్స్‌జెండర్లు, మరోవైపు హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో పనిచేస్తున్నారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 32 మంది హైడ్రా సిబ్బంది ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. వీరు కూడా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విధుల్లో ఉంటున్నారు. ఇటు ట్రాఫిక్ అసిస్టెంట్లు, అటు హైడ్రా సిబ్బంది కలిసి మొత్తం 40 మంది వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో విధులు నిర్వహిస్తుండడంతో ఇక్కడ ట్రాఫిక్ పోలీసుల కొరత చాలావరకు తీరింది. ఈ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలో స్టాప్‌లైన్ దాటి రాకుండా వాహనదారులను నియంత్రించడం, ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు సజావుగా సాగేందుకు తోడ్పడుతున్నారు. సిగ్నల్ జంపింగ్ చేస్తే వారిని గుర్తిస్తున్నారు. కేవలం ట్రాఫిక్ విధులు మాత్రం అక్కడ ఉన్న ట్రాఫిక్ పోలీసులకు సహాయంగా ఉండాలని వీరికి ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.

సాయంత్రం కూడా కొనసాగితే బాగుంటుంది..

సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. అన్ని కూడళ్లు, రహదారుల్లో ఈ నాలుగు గంటలు ట్రాఫిక్ స్తంభించిపోతుంది. అయితే హైడ్రా సిబ్బంది, ట్రాన్స్‌జెండర్లు ఉదయం వేళ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో హైడ్రా సిబ్బంది కొంత మందిని సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు విధుల్లో ఉంచితే ట్రాఫిక్ సమస్యలు చాలవరకు పరిష్కారమవుతాయని వాహనదారులు కోరుతున్నారు. ఫ్రీలెఫ్ట్‌లో వాహనాలు నిలపడం, సిగ్నల్ జంపింగ్, స్టాప్‌లైన్లు దాటి రావడం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలు సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పుడు ఉన్న ట్రాఫిక్ పోలీసులకు అసిస్టెంట్లుగా హైడ్రా సిబ్బందిని సాయంత్రం కూడా విధుల్లో ఉంచితే సమస్య కొంతమేర పరిష్కారం అవుతుందని ట్రాఫిక్ పోలీసులు కూడా భావిస్తున్నారు.





పంజగుట్ట చౌరస్తాలో విధుల్లో ఉన్న ట్రాన్స్‌జెండర్లు (ట్రాఫిక్ అసిస్టెంట్లు)

మలేషియాలో తెలుగు వర్సిటీ కోర్సుల నిర్వహణపై ఒప్పందం



తెలుగు వర్సిటీ కోర్సుల నిర్వహణపై ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

నాంపల్లి: తెలుగు భాష నాలుగేళ్ల డిప్లొమా కోర్సును నిర్వహించేందుకు మలేషియా తెలుగు సంఘం (టీఏఎం) పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు మలేషియాలోని రవాంగ్ పట్టణంలో గురువారం జరిగిన సమావేశంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, టీఏఎం అధ్యక్షుడు డాక్టర్ వెంకట ప్రతాప్, ఉపాధ్యక్షులు సత్తయ్య, సుధాకర్ నాయుడు, సురేశ్ నాయుడు, గౌరవ సలహాదారులు అచ్చయ్య కుమార్ సమక్షంలో ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మాట్లాడుతూ.. మలేషియాలో స్థిరపడ్డ ఎం.సోమా నాయుడు, డి.వి.శ్రీనివాసులు, అప్పల నాయుడు కృషి ఫలితంగానే మలేషియాలో తెలుగు కోర్సుల ప్రారంభానికి శ్రీకారం చుట్టామన్నారు. మలేషియా తెలుగు సంఘం గౌరవ సలహాదారు, ప్రసిద్ధ వైద్యుడు అచ్చయ్య కుమార్ మాట్లాడుతూ.. రవాంగ్ పట్టణంలో తెలుగు సంస్కృతి, ఆచార వ్యవహారాలు ప్రతిబింబించేలా, తెలుగు అకాడమీ పేరుతో విశాల భవన సముదాయాన్ని నిర్మించి తెలుగు సంప్రదాయ పండుగలను, ఆచార వ్యవహారాలు తెలిసేలా సమ్మేళనాలు సమావేశాలను జరుపుతున్నామన్నారు. నాలుగేళ్ల డిప్లొమా కోర్సుతో ఇక్కడివారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలుగు మలేషియా సంఘం అధ్యక్షుడు డాక్టర్ వెంకట ప్రతాప్ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య హనుమంతరావు మాట్లాడుతూ.. తెలుగు భాషలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా కోర్సుల ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు సిలబస్, పరీక్షల నిర్వహణ బాధ్యతలను తెలుగు వర్సిటీ తీసుకుంటుందని తెలిపారు.

పనులు సరే.. మరమ్మతులెప్పుడో..?

అధ్వానంగా మేకల మండి -కేసరి హనుమాన్ రోడ్డు



జియాగూడ: జియాగూడ రహదారి అంటేనే వాహనదారులు జంకే పరిస్థితులు నెలకొంటున్నాయి. పలు అభివృద్ధి పనుల కోసం తవ్విన రోడ్లకు అధికారులు తిరిగి మరమ్మతులు చేపట్టకపోవడంతో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డును తవ్వే క్రమంలోనే సంబంధిత విభాగం మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేస్తుంది. ఆ తర్వాతే పనులు చేపట్టాలి. అయితే పనులు ముగిసిన తర్వాత తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపట్టకుండానే వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

క్లుప్తంగా...

డెయిరీ రంగంలో ఉపాధి అవకాశాలు



మహ్మద్ గౌస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: డెయిరీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎంజీపీ డెయిరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ అన్నారు. రెండు దశాబ్దాలకు పైగా ఈ రంగంలో సేవలు అందిస్తున్న సందర్భంగా తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఎండి లైన్స్ చౌరస్తా వద్ద గల ఎంజీపీ ఔట్‌లెట్‌లో గురువారం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంజీపీ డెయిరీ ప్రొడక్ట్స్ మేనేజర్ మహ్మద్ ఫజల్, మున్నా తదితరులు ఉన్నారు.

రేపు ఎంజీఐటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఇందులో పాల్గొంటారని సంబంధిత వర్గాలవారు తెలిపారు. పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

త్వరలో పార్కును ప్రారంభిస్తాం

మణికొండ: ప్రజలు ఆరోగ్యంగా, ఆహ్లాదంగా ఉండేందుకు పార్కులు ఎంతో ఉపయోగపడతాయని, 9వ వార్డులో అభివృద్ధి చేసిన పార్కును త్వరలోనే ప్రారంభిస్తామని కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక కిరణ్ అన్నారు. తుది మెరుగులు దిద్దుకుంటున్న పార్కు పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అరుణోదయ కాలనీలో ఉన్న పార్కు స్థలాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ఇందులో వాకింగ్ ట్రాక్, యోగా వేదిక, పిల్లలకు ప్లే ఏరియా, ఓపెన్ జిమ్‌లతో పాటు పచ్చిక బయళ్లు ఉన్నాయన్నారు. నార్సింగి గ్రామస్థులతో పాటు అరుణోదయ కాలనీ, ఆనంద పాయెట్రీ గేటెడ్ కమ్యూనిటీల వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. పార్కును ప్రజలంతా ఉపయోగించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. స్థానిక నేత వినోద్ పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఉద్యమ నాయకుడు జేబీ.రాజు



జేబీ రాజు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వివేక్, గీతారెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: బలహీన వర్గాల ఉద్యమ నాయకుడు జేబీ.రాజు అని ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. రవీంద్రభారతీలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శృతిలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దళిత ఉద్యమ నాయకుడు డాక్టర్ జేబీ రాజు 85వ జన్మదిన అమృతోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్ ఇండియా రేడియోలో ఉద్యోగం చేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి జేబీరాజు అని కొనియాడారు. ఆయన చేసిన పోరాటాలు, జీవితకాల చరిత్రపై పుస్తకం రావాలని ఆకాంక్షించారు. అనంతరం జేబీ రాజు దంపతులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు ఆలపించిన సంగీతా విభావరి అలరించాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి గీతారెడ్డి, సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, శృతిలయ కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పున:నిర్మాణ పనులకు భూమి పూజ



ఆలయ పున:నిర్మాణ పనులకు భూమి చేస్తున్న దాతలు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయం పున:నిర్మాణ పనులను దాత అల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో అల్లం కృష్ణ, అల్లం భాస్కర్, అల్లం ఆదిత్య, అల్లం సిద్ధు, రాకేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏరియాసుపత్రికి దంత వైద్యుడు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న దంత వైద్యుడి పోస్టు ఎట్టకేలకు భర్తీ అయింది. కొన్ని నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడి దంత వైద్యులు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. అయితే ఇటీవలే డాక్టర్ రాకేశ్‌కుమార్ బదిలీపై వచ్చారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీ శ్రీనివాస్‌రావు తెలిపారు. దీంతో ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్నట్లు అయ్యిందని పేర్కొన్నారు.

కళాతోరణంలో విరాట్ భక్తి సత్సంగ్ షురూ

నాంపల్లి: తెలుగు లలిత కళాతోరణంలో పరమ పూజ్య సుధాన్షు జీ మహారాజ్ సత్సంగ్ గురువారం రాత్రి ప్రారంభమయ్యింది. నాలుగు రోజుల పాటు ఇవి కొనసాగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, మెడిటేషన్, భజన కార్యక్రమాలు ఉంటాయి.

మాజీ ఎమ్మెల్యే, విశ్వ జాగృతి మిషన్ అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ రాథోడ్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈ నెల 29న ఆదివారం ఉదయం 11 గంటలకు గురు మంత్ర దీక్ష ఉంటుంది. మొదటి రోజు వర్షం కారణంగా అరగంట ఆలస్యంగా ప్రారంభించి అరగంట ముందే ముగించారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

అబిడ్స్: దారుసలాంలోని శివలింగ వినాయక రామ హనుమాన్ సాయిబాబా ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. గోషామహల్ బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తంరావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ అశోక్‌కుమార్, వైస్ చైర్మన్ జంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్ గౌడ్, ఇతర నాయకులు సురేశ్ గౌడ్, నర్సింహారెడ్డి, మహేశ్‌గౌడ్, జగన్, నందకిశోర్ అన్నదానం నిర్వహించారు. అలాగే ఆల పురుషోత్తంరావ్, కిషన్‌ను బీజేపీ నాయకులు, నిర్వాహకులు సత్కరించారు.



వేడుకల్లో ఆల పురుషోత్తంరావు తదితరులు

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న చీఫ్ జస్టిస్ రేణుకా యారా, సభ్యులు

యాకుత్‌పురా: హైదరాబాద్ సిటి సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సర కేలండర్‌ను పురానిహవేలీలోని కోర్టు భవనంలో గురువారం చీఫ్ జస్టిస్ రేణుకా యారా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసా చారి, ప్రధాన కార్యదర్శి దుబ్బక హర్షవర్ధన్, ఉపాధ్యక్షురాలు కే. ప్రవీణారెడ్డి, సంయుక్తా కార్యదర్శి బర్కు రాజేశ్ కుమార్, కోశాధికారి టీ. విశాల్ సింగ్, లైబ్రేరియన్ సుధంష్ కుమార్, క్రీడలు, సంస్కృతిక కార్యదర్శి సైదిరెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఛత్రినాక ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మను సన్మానిస్తున్న ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేఎస్.ప్రసాద్ వర్మను దక్షిణ మండలం సెంట్రల్ పీస్, వెల్ఫేర్ కమిటీ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రామరాజు, కోశాధికారి డీఎల్.నర్సింగ్ గౌడ్, ప్రతినిధులు ఆడాల శివకుమార్, బాగేందర్ సింగ్, మోహన్ రెడ్డి, ఖలీల్, ఉమర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత వాజ్‌పేయిని ఆదర్శంగా తీసుకోవాలి

జియాగూడ: మాజీ ప్రధాని వాజ్‌పేయిని యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు సి.అశోక్‌కుమార్ యాదవ్ అన్నారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ ఆధ్వర్యంలో జియాగూడ ఎంసీహెచ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఫైనల్స్‌లో పీలి మండప్ క్రికెట్ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు, కార్పొరేటర్లు శంకర్ యాదవ్, లాల్‌సింగ్, శశికళ, రాకేశ్ జైస్వాల్, కుల్సుంపురా ఏసీపీ మునావర్, దేవర శ్రీనివాస్, ప్రవీణ్ భాగడి, బలప్రసాద్ తివారీ, రాజేందర్ డేగన్, మనీశ్ జైన్, సతీశ్ బడ్కర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలు వేసి..లైట్లు మరిచారు..!



సూర్యనగర్ కాలనీలో బల్బు లేని విద్యుత్ స్తంభం

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ సూర్యనగర్ కాలనీలో కొంతకాలం క్రితం అధికారులు కొత్తగా 40 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే వాటికి బల్బులు పెట్టకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. ఈ విషయమమై సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని అదే కాలనీకి చెందిన మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్ సోహెల్ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లైట్లు అమర్చాలని ఆయనతో పాటు స్థానికులు కోరుతున్నారు.

నిమ్స్‌లో రక్తదాన శిబిరం

పంజగుట్ట: తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఒనగోని విక్రమ్‌గౌడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేసిన యువకులను ప్రోత్సహించి వారికి సర్టిఫికెట్లు అందచేశారు. ప్రతీ ఒక్క యువత వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని వీరయ్య కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని అనాథ ఆశ్రమంలో అన్నదానం చేసి కేక్ కట్ చేశారు.

శరవేగంగా కార్వాన్ అభివృద్ధి



వివిధ సంఘాల నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర డివిజన్ల నుంచి పలు సంఘాల వారు మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో గురువారం ఆయన్ను కలిశారు ఈ సందర్భంగా పలువురు తాగునీరు, రోడ్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పలు డివిజన్లలో వరద నీటి పైపులైన్ల పనుల కోసం తవ్వకాలు చేపట్టారని, అవి పూర్తి కాగానే రోడ్డు మరమ్మతులు కూడా చేయిస్తానన్నారు. ఇళ్లల్లోకి వరద రాకుండా నిజాం కాలనీలో నూతన డ్రైనేజీ నిర్మించడమే కాకుండా టోలిచౌకీ చౌరస్తా తదితర ప్రాంతాల్లో బాక్స్ డ్రైనేజీలు పనులు చేట్టామన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు అలీముద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులు ఉన్నారు.

'కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తొలగించాలి'



ధర్నాలో మహ్మద్ వలీవుల్లా సమీర్, నాయకులు

యాకుత్‌పురా: రాజ్యాంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ వలీవుల్లా సమీర్ డిమాండ్ చేశారు. నగర శాఖ ఆధ్వర్యంలో యాకుత్‌పురా బడాబజార్‌లో గురువారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నగర పార్టీ ఉపాధ్యక్షుడు మీర్జా అస్కర్ అలీ బేగ్, బ్లాక్ అధ్యక్షుడు సంతోష్ కుమార్, నాయకులు షకీల్ దయాని, సిరాజ్ అలీ, హైదర్ జాఫ్రీ, ప్రదీప్ కుమార్ గౌడ్, రజా అలీ మీర్జా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

చాంద్రాయణగుట్ట: కేంద్ర మాజీమంత్రి టైగర్ నరేంద్ర స్మారక క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. బీజేపీ నాయకుడు ఉదయ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో అలియాబాద్‌లోని ఫూల్‌బాగ్ చమాన్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన టోర్నీలో 16 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో గబ్బర్ సీసీ జట్టు గెలుపొందింది. గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర ట్రోఫీతో పాటు రూ.20 వేలు, రన్నరప్ జట్టుకు రూ.6 వేలు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టీ ఉమా మహేంద్ర, ధర్మతేజ పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఆలే జితేంద్ర

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం





గన్‌ఫౌండ్రీ: రవీంద్రభారతీలో ప్రముఖ నృత్య శిక్షణాలయం కళా నృత్య నికేతన్ స్కూల్ ఆఫ్ కూచిపూడి అకాడమీ 16వ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. 2007లో సంస్థను స్థాపించి వందలాది మంది కళాకారులను తయారు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. నాట్య గురువు డాక్టర్ బిందు అభినయ్ ఆధ్వర్యంలో సంస్థకు చెందిన 146 మంది విద్యార్థులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత భాగవతుల సేతురాం, పద్మశ్రీ ఉమా మహేశ్వరీ, కళాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షికోత్సవ వేడుకలు

గన్‌ఫౌండ్రీ: కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో మంజీరం అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ మూడో వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా పద్మావతి పరిణయం, అన్నమాచార్య సంకీర్తనలతో చేసిన భరత నాట్య నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు సురాగ ప్రసాద్ ఇరవల్లి మాట్లాడుతూ.. భరతనాట్యం నేర్చుకోవడం వల్ల ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించబడతాయన్నారు. కార్యక్రమంలో సాహిత్య కల్ప సంస్థ వ్యవస్థాపకురాలు సాహిత్య రాంకుమార్, పలువురు నాట్య గురువులు పాల్గొన్నారు.





సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9989616273